7

సాక్షి

అల్లూరి సీతారామరాజు జిల్లా

బుధవారం । 27 । నవంబర్ । 2024



చలిగాలులు ఉధృతం

జిల్లా వ్యాప్తంగా చలిగాలులు ఉధృతమయ్యాయి. కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి.

8లో



గంజాయి తోటలు ధ్వంసం

వనుగుమ్మ పంచాయతీ దాబుగూడ,సంగడ గ్రామాల్లో 4 ఎకరాల్లో గంజాయి పంటను పోలీసులు ధ్వంసం చేశారు.

8లో



కార్యకర్తలపై దాడులు సహించం

వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా ప్రతినిధులు, కార్యకర్తలపై దాడులు చేస్తే సహించేది లేదని ఎమ్మెల్యే మత్స్యలింగం అన్నారు.

8లో

న్యూస్‌రీల్

చింతూరు సీహెచ్‌సీకి ప్రథమ స్థానం



ప్రథమస్థానం సాధించిన చింతూరు సీహెచ్‌సీ

చింతూరు: కాయకల్ప కార్యక్రమం అమలులో చింతూరు సీహెచ్‌సీకి రాష్ట్రంలో ప్రథమస్థానం లభించినట్టు ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎం.వి.కోటిరెడ్డి మంగళవారం తెలిపారు. 2023–24 ఆర్థిక సంవత్సరానికి కాయకల్ప కార్యక్రమం లక్ష్యాన్ని సాధించినందుకు గాను ఈ అవార్డు లభించిందని ఆయన తెలిపారు. ఆయుష్మాన్ భారత్, గున్వత్ స్వాస్థ తదితర కార్యక్రమాలను ప్రభుత్వ మార్గదర్శకాలను అనుసరించి నిర్వహించినట్లు చెప్పారు. ప్రజారోగ్య సంరక్షణ, పరిశుభ్రత, సంక్రమణ నియంత్రణ పద్ధతులను ప్రోత్సహించడం, పబ్లిక్ హెల్త్‌కేర్ సౌకర్యాలను ప్రోత్సహించడం వంటి కార్యక్రమాలను చేపట్టినట్టు ఆయన వివరించారు.

హెల్త్ ఎమర్జెన్సీ కోసం ఐటీడీఏలో టోల్ ఫ్రీ నంబర్

పాడేరు : స్థానిక ఐటీడీఏ పరిధిలోని 11 మండలాల ప్రజలు అనారోగ్య సమస్యలు, అత్యవసర పరిస్థితులు తలెత్తినప్పుడు సహాయం పొందేందుకు వీలుగా పాడేరు ఐటీడీఏలో ప్రత్యేక టోల్ ఫ్రీ నంబర్ ఏర్పాటు చేసినట్టు పాడేరు డీఎంహెచ్‌వో జమాల్‌బాషా మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. 24 గంటలూ ఈ కాల్ సెంటర్ అందుబాటులో ఉంటుందని పేర్కొన్నారు. అత్యవసర పరిస్థితుల్లో ప్రజలు 180042500004 నంబర్‌కు ఫోన్ చేసి అంబులెన్స్, ఇతర సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

కిరండూల్‌కు అదనపు విస్టాడోమ్ కోచ్

తాటిచెట్లపాలెం (విశాఖ): ఈ సీజన్‌లో అరకు అందాలను వీక్షించే పర్యాటకులు, ప్రయాణికుల సౌకర్యార్థం, వెయిటింగ్ లిస్ట్ ప్రయాణికుల జాబితాను క్లియర్ చేసేందుకు కిరండూల్ రైళ్లకు ఆయా తేదీల్లో అదనపు కోచ్‌ను జత చేస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం సందీప్ తెలిపారు. విశాఖపట్నం–కిరండూల్ (08551) పాసింజర్ స్పెషల్‌కు డిసెంబరు 5,7,9,11,13,15, 17,19,21,23,25,27,29,31 తేదీల్లో, తిరుగు ప్రయాణంలో కిరండూల్–విశాఖపట్నం(08552) పాసింజర్ స్పెషల్‌కు డిసెంబరు 6,8,10,12,14,16,18, 20,22,24, 26,28,30, జనవరి 1వ తేదీల్లో ఒక విస్టాడోమ్ కోచ్‌ను అదనంగా జతచేస్తున్నట్లు పేర్కొన్నారు.



గిరిజన ప్రాంతాలలో ప్రత్యేక అలవెన్సులు పునరుద్ధరించాలని పాడేరు ఐటీడీఏ వద్ద ధర్నా చేస్తున్న పీహెచ్‌సీ వైద్యులు



నవంబర్ 23: కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న గ్రామ వలంటీర్లు



పాడేరు ఐటీడీఏ ఎదుట రిలే దీక్షలు చేస్తున్న గురుకుల విద్యాలయాల అవుట్ సోర్సింగ్ సిబ్బంది

ఆవేదన ఆక్రోశం ఆగ్రహం

అన్ని వర్గాల ఆందోళన బాట

- నిరసనలతో హోరెత్తిస్తున్న జనం
- విధుల్లోకి తీసుకోవాలని వీధుల్లోకి వలంటీర్లు
- జీతాల కోసం రోడ్డెక్కిన 108 ఉద్యోగులు
- అదే బాటలో వైద్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు, ఆయాలు
- గుర్రుగా గురుకుల విద్యాలయాల సిబ్బంది

కొత్త ప్రభుత్వం వచ్చి ఆరునెలలైంది. అప్పుడే ప్రజల్లో తీవ్ర అసంతృప్తిని మూటగట్టుకుంది. తమ సమస్యల పరిష్కారం కోసం అన్ని వర్గాల ప్రజలూ ఆందోళన బాటపడుతున్నారు. వివిధ రూపాల్లో నిరసనలు వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో వలంటీర్లు, గురుకుల విద్యాలయ ఉద్యోగులు, 104, 108 సిబ్బంది, ఆశ కార్యకర్తలు, నిరుద్యోగులు, విద్యార్థులు, ఆదివాసీ జేఏసీ నాయకులు ఇలా అన్ని వర్గాల వారు వివిధ రూపాల్లో తమ నిరసన, ఆవేదన, ఆక్రోశం వ్యక్తం చేస్తున్నారు. అందరి మాట.. అందరి డిమాండ్ ఒక్కటే 'మీరిచ్చిన హామీలు అమలు చేయండి.. మేం చేసిన పనికి వేతనాలివ్వండి'.. అయితే ఇవేమీ పట్టని ప్రభుత్వం డైవర్షన్ రాజకీయాలు చేస్తోంది. మొత్తంగా ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మికులతోపాటు చిరుద్యోగులు రోడ్డెక్కడం కూటమి సర్కార్ తీరుకు అద్దం పడుతోంది.

సాక్షి,పాడేరు : అవసరం తీరే వరకూ ఆశల పల్లకీలో ఊరేగించి, ఏరు దాటాక తెప్ప తగలేసిన చందంగా కూటమి సర్కార్ తీరు ఉందని జిల్లా ప్రజలు మండిపడుతున్నారు. అధికారం చేపట్టి ఆరు నెలలైనా ఇచ్చిన హామీలు నెరవేరడం లేదంటూ ఆగ్రహావేశాలతో రగిలిపోతున్నారు. వాగ్దానాలు హుష్‌కాకి అవడంతో తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది. హామీల అమలు మాటు అటుంచగా తుదకు కనీస సౌకర్యాలు కల్పించడంలో, సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమవడంతో తాము కష్టాల కడలిలో ఈదవలసి వస్తోందని జిల్లా వాసులు వాపోతున్నారు. హామీలిచ్చి చేతులు దులుపుకొన్న కూటమి సర్కార్ తీరుపై వారిలో ఆగ్రహం నివురుగప్పిన నిప్పు కణికలా ఉంది. ఈ నేపథ్యంలో అన్ని వర్గాల ప్రజల నుంచి నిరసనలు, ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులతో పాటు స్కీమ్ వర్కర్లు, వెలుగు యానిమేటర్లు, 104, 108 సిబ్బంది, విద్యార్థులు, నిరుద్యోగులు తమ సమస్యలు పరిష్కరించాలని ఆందోళనలు చేపడుతున్నారు. జిల్లా కేంద్రం పాడేరులోని కలెక్టరేట్‌తో పాటు ప్రతి శుక్రవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక సందర్భంగా పాడేరు ఐటీడీఏ కార్యాలయం వద్ద ర్యాలీలు, ధర్నాలు, రిలే దీక్షలతో హోరెత్తిస్తున్నారు. పాడేరు పట్టణ వీధుల్లో తరచూ ర్యాలీలు, నిరసన ప్రదర్శనలు నిర్వహిస్తూ తమ ఆగ్రహం, ఆక్రోశం, ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమ న్యాయ సమ్మతమైన సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తున్నారు.

మద్యం దుకాణాల సిబ్బంది నిరసన పట్టని ప్రభుత్వం

ప్రభుత్వ మద్యం దుకాణాల్లో పనిచేసిన ఉద్యోగులు జిల్లా కేంద్రం పాడేరులో ర్యాలీలు, కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహిస్తున్నా...అధికారులకు వినతిపత్రాలు అందజేస్తున్నా పాలకులు పట్టించుకోవడం లేదు. దీంతో భవిష్యత్తుపై బెంగతో వీరంతా తల్లడిల్లిపోతున్నారు. తమతో ప్రభుత్వం ఆటలాడుతోందని తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఆందోళనబాటలో అంగన్‌వాడీలు

ఎన్నికల సమయంలో హామీ ఇచ్చినట్టుగా సమాన పనికి సమాన వేతనం అందజేయాలని, మినీ అంగనవాడీలను ప్రధాన అంగన్‌వాడీలుగా గుర్తించాలని, అర్హులైన కార్యకర్తలకు గ్రేడ్–2 సూపర్‌వైజర్లుగా పదోన్నతులు కల్పించాలని అంగన్‌వాడీ కార్యకర్తలు ఆందోళనబాట పట్టారు. పాడేరు ఐటీడీఏ, కలెక్టరేట్‌ల ముట్టడితో తమ నిరసన వ్యక్తం చేశారు.

జీవితాల్లో 'వెలుగు' నింపండి

ఉద్యోగ భద్రత కల్పించడంతో పాటు పెండింగ్ వేతన బకాయిలు చెల్లించాలని, అలవెన్స్‌లు మంజూరు చేయడంతో పాటు యూనిఫాంలు పంపిణీ చేయాలని వెలుగుసంస్థలో పనిచేస్తున్న వీవోఏలు వేడుకుంటున్నారు. తమ సమస్యల పరిష్కారం కోసం కలెక్టరేట్ వద్ద ధర్నాలు చేశారు

రిలే దీక్షలు చేస్తున్నా...

ఏజెన్సీలోని గిరిజన సంక్షేమ గురుకుల విద్యాలయాల్లో అవుట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ పద్ధతిపై పని చేస్తున్న అధ్యాపకులు, ఉపాధ్యాయులు, ఇతర సిబ్బంది 10రోజుల నుంచి పాడేరు ఐటీడీఏ ఎదుట రిలే దీక్షలు చేస్తున్నారు. సమాన పనికి సమాన వేతనాలు చెల్లించాలని, ఉద్యోగాలను రెగ్యులర్ చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేస్తూ పాడేరు ఐటీడీఏ ముందు టెంట్ వేసి ఆందోళన చేస్తున్నారు.



నవంబర్ 16: పాడేరు ఐటీడీఏ ఎదుట ధర్నా చేస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది

కలెక్టరేట్, ఐటీడీఏల వద్ద జరిగిన ఆందోళనలు

- **సెప్టెంబర్ 11** : ఉద్యోగ భద్రత కల్పించాలని,జీవో నంబర్ 115 రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ కాంట్రాక్ట్ హెల్త్ నర్స్‌లు ధర్నా.
- **సెప్టెంబర్ 21:** గిరిజన ప్రాంతాల్లో ప్రత్యేక అలవెన్స్‌లు పునరుద్ధరించాలని పీహెచ్‌సీ వైద్యులు పాడేరు ఐటీడీఏ ఎదుట ప్లకార్డులతోఆందోళన.
- **అక్టోబర్ 16:** ప్రభుత్వ మద్యం దుకాణాల్లోని పనిచేసిన సిబ్బంది ధర్నా
- **అక్టోబర్ 30:** జీవో నంబర్ 3 పునరుద్ధరణ,గిరిజన ప్రాంతాల్లో ప్రత్యేక డీఎస్సీ నిర్వహించాలన్న డిమాండ్‌తో ఆదివాసీ జేఏసీ నేతలు,గిరిజన విద్యార్థి సంఘం నేతల ఆందోళన, ధర్నా.
- **నవంబర్ 14:** బకాయి వేతనాలను చెల్లించడంతో పాటు ప్రతి నెలా సక్రమంగా జీతాలు ఇవ్వాలనే డిమాండ్‌తో 104 సిబ్బంది ధర్నా.
- **నవంబర్ 20:** ఉద్యోగ భద్రత,పెండింగ్ వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ వెలుగు సంస్థలో పనిచేస్తున్న వీవోఏలు ర్యాలీ, ధర్నా
- **నవంబర్ 16:** డిమాండ్ల సాధనకోసం అంగన్‌వాడీ కార్యకర్తల ఆందోళన.
- **నవంబర్ 23:** ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు ఉద్యోగాల్లోకి తీసుకుని, నెలకు రూ.10వేల గౌరవ వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ గ్రామ వలంటీర్ల ధర్నా, ర్యాలీ.

వైద్య సిబ్బంది ఆవేదన



నవంబర్ 14: ఐటీడీఏ ఎదుట ధర్నా చేస్తున్న 104 సిబ్బంది

తమకు ప్రత్యేక అలవెన్స్‌లు పునరుద్ధరించాలని వేడుకుంటున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో ఏజెన్సీ పీహెచ్‌సీల్లో పనిచేస్తున్న వైద్యులు ఆందోళన బాట పట్టారు. పీహెచ్‌సీలు, ఐటీడీఏ కార్యాలయాల వద్ద నిరసన కార్యక్రమాలు చేపట్టారు. పెండింగ్ వేతనాలు చెల్లించాలని, ఇతర సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ 104,108 సిబ్బంది ఆందోళనలు చేశారు. ఐటీడీఏల ఎదుట రిలే దీక్షలు చేపట్టారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ స్టాఫ్ నర్స్‌లు కూడా తమకు ఉద్యోగ భద్రతకు డిమాండ్ చేస్తూ కలెక్టరేట్ వద్ద ఆందోళన చేశారు.



పాడేరు ఐటీడీఏ ఎదుట ధర్నా చేస్తున్న గురుకుల సిబ్బందికి సంఘీ భావం తెలిపిన గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు బాలదేవ్



అక్టోబర్ 16: కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న ప్రభుత్వ మద్యం దుకాణాల సిబ్బంది



సెప్టెంబర్ 11: ఉద్యోగ భద్రత కల్పించాలని పాడేరు కలెక్టరేట్ వద్ద కాంట్రాక్ట్ హెల్త్ నర్స్‌ల ధర్నా



నవంబర్ 20 : ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న వెలుగు వీవోఏలు

5, 6 షెడ్యూళ్లతో గిరిజనులకు ప్రత్యేక హక్కులు

ఘనంగా భారత రాజ్యాంగ ఆమోద దినోత్సవం



కలెక్టరేట్‌లో ప్రతిజ్ఞ చేస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్, జేసీ డాక్టర్ అభిషేక్‌గౌడ్ ఇతర అధికారులు



న్యాయవాదులతో కలసి ప్రతిజ్ఞ చేస్తున్న న్యాయమూర్తి బాబు

సాక్షి,పాడేరు: రాజ్యాంగంలో 5,6 షెడ్యూళ్లను ఏర్పాటు చేయడంతో గిరిజనులకు ప్రత్యేక హక్కులు,చట్టాలు అమలులోకి వచ్చాయని కలెక్టర్ ఎ.ఎస్.దినేష్‌కుమార్ తెలిపారు. కలెక్టరేట్‌లో 75 వసంతాల భారత రాజ్యాంగ ఆమోద దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ చిత్రపటానికి కలెక్టర్ పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1949 నవంబర్ 26న రాజ్యాంగాన్ని ఆమోదించారన్నారు. అనంతరం భారత రాజ్యాంగ పరిరక్షణపై కలెక్టర్ అధికారులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో జేసీ డాక్టర్ అభిషేక్‌గౌడ్, డీఆర్వో పద్మలత,డీఆర్‌డీఏ పీడీ వి.మురళీ,పలుశాఖల అధికారులు,సిబ్బంది పాల్గొన్నారు.

అందరికీ రాజ్యాంగ ఫలాలు అందాలి

అడ్డతీగల: రాజ్యాంగ ఫలాలు అందరికీ అందాలని అడ్డతీగల జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ కోర్టు న్యాయమూర్తి పి.బాబు అన్నారు.స్థానిక కోర్టులో మంగళవారం రాజ్యాంగ దినోత్సవాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతీయులంతా సమానమేనని రాజ్యాంగం ద్వారా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చాటి చెప్పారన్నారు. హక్కులను పొందడంతో పాటు బాధ్యతల నిర్వహణలో ప్రతి ఒక్కరూ ముందుండాలని తెలిపారు. రాజ్యాంగబద్ధంగా విధుల నిర్వహణకు కట్టుబడి ఉంటామని న్యాయవాదులతో కలసి ప్రతిజ్ఞ చేశారు.ఈ కార్యక్రమంలో పలువురు న్యాయవాదులు,కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

శిక్షణ కేంద్రంలో భక్షణ

- పాడేరు ఏఎన్‌ఎం శిక్షణ కేంద్రంలో అడ్మిషన్ ఫీజు పేరుతో అక్రమంగా వసూళ్లు
- అరకు ఎంపీకి విద్యార్థుల ఫిర్యాదు
- కేవలం ముగ్గురు ఉద్యోగులతోనే ట్రైనింగ్ సెంటర్ నిర్వహణ
- డిప్యూటేషన్‌పై వచ్చిన హెల్త్ ఎడ్యుకేటర్ ఐదేళ్లకుపైగా ఇక్కడే తిష్ట
- కొరవడిన అధికారుల పర్యవేక్షణ

పాడేరు : జిల్లా కేంద్రం పాడేరులోని ప్రభుత్వ ఏఎన్ఎం ట్రైనింగ్ సెంటర్‌లో గత కొన్నాళ్లుగా పలు అక్రమాలు చోటు చేసుకుంటున్నాయి. ఆసక్తి గల గిరిజన విద్యార్థినులకు ఏఎన్ఎంలుగా శిక్షణ ఇచ్చేందుకు గతంలో ప్రభుత్వం ఇక్కడ శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేసింది. ప్రతి ఏటా సుమారు 30 మంది గిరిజన విద్యార్థినులకు రెండేళ్ల పాటు శిక్షణ అందిస్తారు. గతంలో ఉన్న శిక్షణ కేంద్రం భవనం పూర్తిగా పాడైపోవడంతోగత ప్రభుత్వం హయాంలో కొత్తగా భవనం మంజూరైంది. ఆ సమయంలో మొదటి సంవత్సరం విద్యార్థినులకు పాత ఎస్‌బీహెచ్ భవనంలో తరగతులు నిర్వహించి, వసతి సౌకర్యం కల్పించారు. ఇక రెండో సంవత్సరం విద్యార్థినులను క్లీనికల్ శిక్షణకు విశాఖపట్నం పంపించారు. భవన నిర్మాణం పూర్తవడంతో ఈ ఏడాది రెండు సంవత్సరాల వారికి పాడేరులోనే ఉంచి శిక్షణ ఇవ్వాలి. కానీ మొదటి సంవత్సరం విద్యార్థినులను పాడేరు, ద్వితీయ సంవత్సరం వారిని విశాఖపట్నంలోనే ఉంచేశారు. ఏఎన్ఎం ట్రైనింగ్ కేంద్రం ప్రిన్సిపాల్ స్థానికంగా ఉండడం లేదని, ఆమె విశాఖపట్నంలో ఉంటున్నారని అందుకే రెండో సంవత్సరం విద్యార్థినులను క్లీనికల్ శిక్షణ పేరుతో అక్కడే ఉంచేశారని ఆరోపణలున్నాయి. ఆమె అప్పుడప్పుడు పాడేరు వచ్చి వెళ్తుంటారని సమాచారం.

కొత్త విద్యార్థినుల నుంచి అక్రమంగా వసూళ్లు


ఈ ఏడాది ఇటీవల మొదటి సంవత్సరంలో ప్రవేశానికి నోటిఫికేషన్ ఇచ్చారు. దీంతో ముందుగా 29 మంది ప్రవేశం పొందారు. వీరిలో 27 మంది నుంచి అడ్మిషన్ ఫీజు పేరిట రూ.3వేలు, అడ్మిషన్ అప్లికేషన్ ఫారం కోసం రూ.50 నుంచి రూ.100 చొప్పున వసూలు చేశారని విద్యార్థినులు ఆరోపిస్తున్నారు. ఇటీవల అరకు ఎంపీకి లిఖిత పూర్వకంగా వారు ఫిర్యాదు చేయడంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. విషయం బయటకు పొక్కిందని తెలుసుకున్న ట్రైనింగ్ సెంటర్ నిర్వాహకులు అదే విద్యార్థినుల చేత తాము మెస్ ఫీజు కోసం అడ్వాన్స్‌గా రూ.3వేలు చెల్లించామని రాయించుకుని సంతకాలు చేయించుకున్నట్టు సమాచారం. ఫ్రెషర్స్‌డే పార్టీ కోసం ఒక్కో విద్యార్థిని నుంచి రూ.500 వసూలు చేసినట్టు తెలిసింది. వాస్తవానికి ప్రభుత్వం నిర్వహిస్తున్న ఈ శిక్షణకు ఎటువంటి ఫీజులు చెల్లించాల్సిన అవసరం లేదు. కానీ అందుకు విరుద్ధంగా అడ్మిషన్ ఫీజు పేరిట రూ.3వేలు వసూలు చేశారని, పైగా వాటిని సంబంధించి ఎటివంటి రశీదులు ఇవ్వలేదని విద్యార్థినులు చెబుతున్నారు.



పాడేరులో ఉన్న ప్రభుత్వ ఏఎన్ఎం ట్రైనింగ్ సెంటర్

ముగ్గురితోనే ట్రైనింగ్ సెంటర్ నిర్వహణ

ప్రభుత్వ ఏఎన్ఎం ట్రైనింగ్ సెంటర్‌ను కేవలం ముగ్గురితోనే నిర్వహిస్తున్నారు. హెల్త్ ఎడ్యుకేటర్, స్టాఫ్ నర్స్, అసిస్టెంట్ ఉన్నారు. ద్వితీయ సంవత్సరం విద్యార్థినులు విశాఖపట్నంలో ఉండడంతో ప్రిన్సిపాల్, మరో ఎంపీహెచ్‌ఈవో, ఓ బీఎస్సీ నర్సింగ్ టీచింగ్ ఉద్యోగి ఎక్కువ రోజులు అక్కడే ఉంటున్నారని పాడేరు శిక్షణ కేంద్రానికి అప్పుడప్పుడు వస్తుంటారని భోగట్టా. ఒక హెల్త్ ఎడ్యుకేటర్, బీఎస్సీ నర్సింగ్ చేసిన టీచింగ్ స్టాఫ్‌తో కలిసి సెంటర్ నిర్వహిస్తున్నారు.దీంతో శిక్షణ తూతూ మంత్రంగా సాగుతోందని విద్యార్థినులు తెలిపారు. హెల్త్ ఎడ్యుకేటర్ వేరే ప్రాంతం నుంచి డిప్యూటేషన్‌పై వచ్చి తన పలుకుబడిని ఉపయోగించుకుని సుమారు ఐదేళ్లకు పైగా ఇక్కడే తిష్టవేసి అన్ని తానై నడిపిస్తున్నట్టు తెలుస్తోంది. ఈ కేంద్రంపై సంబంధిత అధికారుల పర్యవేక్షణ కొరవడడంతో నిర్వాహకులు ఆడిందే ఆటా పాడిందే పాటగా సాగుతోందని స్థానికులు ఆరోపిస్తున్నారు.



విద్యార్థినులు అరకు ఎంపీకి రాసిన ఫిర్యాదు పత్రం

రూ.3 వేల చొప్పున వసూలు చేశారని తెలిసింది



శిక్షణ కేంద్రంలో తొలుత 29 మంది మాత్రమే అడ్మిషన్ పొందారు. కానీ ఈ ఏడాది ఉన్నతాధికారులతో మాట్లాడి 40 వరకు అడ్మిషన్లు పెంచాం. విద్యార్థుల నుంచి రూ.3వేల చొప్పున వసూలు చేశారని తమ దృష్టికి వచ్చింది. నిర్వాహకులను వివరణ అడిగితే మెస్ ఫీజు కోసం అడ్వాన్స్‌గా రూ.3వేలు తీసుకున్నామని, నిధులు రాగానే రీయింబర్స్ చేస్తామని చెప్పారు. విశాఖపట్నంలో క్లీనికల్ శిక్షణ కోసం ఉన్న విద్యార్థులు కూడా పాడేరు శిక్షణ కేంద్రంలోనే ఉంచాలని, పాడేరు జిల్లా ఆస్పత్రిలోనే క్లీనికల్ శిక్షణ పూర్తి చేయాలని, ప్రిన్సిపాల్ స్థానికంగా ఉండాలని ఆదేశాలు జారీ చేశాం. హెల్త్ ఎడ్యుకేటర్ పోస్టుల కొరత అధికంగా ఉంది. శిక్షణ కేంద్రంలో పనిచేసేందుకు ఎవరూ ముందుకు రాకపోవడంతో ఆ హెల్త్ ఎడ్యుకేటర్ ఎక్కువ సంవత్సరాలు ఇక్కడే పని చేస్తున్నారు. మిగిలిన అంశాలపై దృష్టి సారించి వాటి పరిష్కారానికి కృషి చేస్తాం.

– డాక్టర్ జమాల్‌బాషా, జిల్లా వైద్యారోగ్యశాఖాధికారి, పాడేరు.

ఏళ్లనాటి కల.. తీరిన వేళ

- న్యాయమూర్తి చొరవతో డి.పోలవరప్పాడుకు రహదారి
- జడ్జికి కృతజ్ఞతలు తెలిపిన గ్రామస్తులు



డి.పోలవరప్పాడుకి వేసిన రహదారి, కల్వర్టు పనులు పరిశీలిస్తున్న న్యాయమూర్తి బాబు

అడ్డతీగల: మండలంలోని డి.పోలవరప్పాడు ఆదివాసీల ఏళ్లనాటి కల న్యాయమూర్తి బాబు చొరవతో సాకారమైంది. గత ఆగస్టులో హైకోర్టు ఆదేశాల మేరకు జిల్లా న్యాయసేవాధికార సంస్థ సభ్యులు,అడ్డతీగల జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ కోర్టు న్యాయమూర్తి పి.బాబు.. మారుమూలన ఉన్న డి.పోలవరప్పాడు గ్రామాన్ని సందర్శించారు. తమ గ్రామానికి చాలా ఏళ్ల నుంచి రోడ్డు సౌకర్యం లేదని, మంజూరైన రహదారి పనులు అర్ధాంతరంగా నిలిపివేయడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, అత్యవసర పరిస్థితుల్లో మండల కేంద్రానికి వెళ్లాలన్నా కనీసం అంబులెన్స్ కూడా రాని పరిస్థితి ఉండడంతో అవస్థలకు గురవుతున్నామని గ్రామస్తులు న్యాయమూర్తి దృష్టికి తీసుకొచ్చారు. దీంతో ఈ సమస్యను ఆయన ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారితో పాటు ఇంజినీరింగ్ అధికారుల దృష్టికి తీసుకువెళ్లడంతో వారు వెంటనే స్పందించి రహదారి పనులు పూర్తి చేయించారు. మంగళవారం మళ్లీ ఆ గ్రామాన్ని న్యాయమూర్తి పి.బాబు సందర్శించారు. పూర్తయిన రహదారిని పరిశీలించారు. మా కల నెరవేర్చారు సార్ అంటూ డి.పోలవరప్పాడు ఆదివాసీలు ఈ సందర్భంగా ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు.అనంతరం గ్రామంలోని పాఠశాలను న్యాయమూర్తి తనిఖీ చేశారు.విద్యార్థులకు తగిన రీతిలో విద్యాబోధన జరగడం లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు.దుశ్చర్తి ఎస్ఐ వెంకయ్య,న్యాయవాదులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

న్యాయవాదుల మహాసభకు తరలిరండి



కరపత్రాలు విడుదల చేస్తున్న న్యాయవాదులు

అడ్డతీగల: న్యాయవాదుల సమస్యల పరిష్కారానికి డిసెంబర్ 8న కాకినాడ జిల్లా అన్నవరంలోని శేషాద్రి సదన్‌లో నిర్వహించతలపెట్టిన రాష్ట్ర మహాసభకు న్యాయవాదులంతా తరలిరావాలని ఆల్ ఇండియా న్యాయవాదుల అసోసియేషన్ ఫర్ జస్టిస్ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కన్వీనర్ బుగతా శివ కోరారు. స్థానిక జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ కోర్టు వద్ద అడ్డతీగల బార్ అసోసియేషన్ సభ్యులతో కలసి మంగళవారం కరపత్రాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ న్యాయవాదులు ప్రయోజనాలు, హక్కులు కాపాడడంలో అసోసియేషన్ ముందుంటుందన్నారు. హక్కుల కోసం పోరాడే న్యాయవాదులపై పాలకులు నిరంకుశ చట్టాలు ప్రయోగించడాన్ని ఆపాలని డిమాండ్ చేశారు. మహిళా న్యాయవాదులకు బార్ అసోసియేషన్లలో సరైన ప్రాతినిధ్యం ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో అడ్డతీగల బార్ అసోసియేషన్ సభ్యులు కె.ఎస్.వి.రమణ, డి.శ్రీధర్, వై.శ్రీనివాస్, గౌరీశంకర్, ఐలాజ్ సభ్యులు జోగా ప్రసాద్ పాల్గొన్నారు.

జీసీసీని ప్రక్షాళన చేస్తాం

- జీసీసీ ఛైర్మన్ శ్రావణ్ కుమార్


మాట్లాడుతున్న జీసీసీ ఛైర్మన్ శ్రావణ్‌కుమార్

అరకులోయటౌన్: జీసీసీని ప్రక్షాళన చేస్తామని జీసీసీ ఛైర్మన్ కిడారి శ్రావణ్ కుమార్ తెలిపారు. అరకులోయలోని గోష్ఠి సమావేశ మందిరంలో మంగళవారం జీసీసీ డివిజన్ స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా 75వ రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జీసీసీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయలన్నారు. ఈ ఏడాది 1,500 నుంచి 2వేల మెట్రిక్ టన్నుల కాఫీ కొనుగోలుకు ఉద్యోగులందరూ కృషి చేయాలన్నారు. జీసీసీపై గిరిరైతులకు నమ్మకం పెరిగేలా పనిచేయాలని సూచించారు. జీసీసీ పెట్రోల్ బంక్‌లు నష్టాల బారిన పడకుండా చూడాలని, గ్యాస్ కనెక్షన్లు పెంచాలని ఆదేశించారు. జీసీసీ జనరల్ మేనేజర్ ఉమాదేవి, కాఫీ మేనేజర్ శ్రీనివాసరావు, డీఎంలు సింహాచలం, దేవరాజు, జీసీసీ మేనేజర్లు, సిబ్బంది, డీలర్లు పాల్గొన్నారు.

కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలు వీడాలి


కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న రైతు, కార్మిక సంఘాలు


రంపచోడవరం ఐటీడీఏ వద్ద ఆందోళన చేస్తున్న స్కీమ్ వర్కర్లు

రైతు, కార్మిక సంఘం ఆధ్వర్యంలో ధర్నా

సాక్షి,పాడేరు: కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు అమలుజేస్తున్న రైతు, కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఆయా సంఘాల నేతలు మంగళవారం జిల్లా కేంద్రం పాడేరులో పెద్ద ఎత్తున ఆందోళనచేశారు. ర్యాలీ నిర్వహించి, కలెక్టరేట్ వద్ద బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. కేంద్రంలో ఎన్డీఏ,రాష్ట్రంలో కూటమి ప్రభుత్వాల నిరంకుశ విధానాలకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉమామహేశ్వరరావు,ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి పడాల అరుణ,ఆదివాసీ కాఫీ రైతు సంఘం నేత జి.చినబాబు మాట్లాడుతూ కేంద్రంలో ఎన్డీఏ ప్రభుత్వం కార్మికులు,రైతుల పట్ల వ్యతిరేక విధానాలను అవలింభిస్తోందన్నారు. ఆ విధానాలను ఉపసంహరిచుకోవాలని, రైతుల, కార్మికుల, ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని, లేకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం కలెక్టర్ దినేష్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. సీఐటీయూ, ఏఐటీయూసీ నేతలు లక్కు,సుందరరావు, అమర్,రాజబాబు,వలంటీర్ల సంఘం నేత సురేష్‌కుమార్,అంగన్‌వాడీ,సీహెచ్‌డబ్ల్యూ సంఘాల నాయకులు అన్నపూర్ణ,దాసమ్మ,పద్మ,సరస్వతి,భవాని పాల్గొన్నారు.

స్కీం వర్కర్ల ధర్నా

రంపచోడవరం: కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక, ఉద్యోగ వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా స్థానిక ఐటీడీఏ కార్యాలయం వద్ద మంగళవారం సీఐటీయూ ఆధ్వర్యంలో స్కీం వర్కర్ల ధర్నా చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షులు మట్ల వాణిశ్రీ, ఉపాధ్యక్షులు కె.శాంతి రాజు, అంగన్‌వాడీల యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.నిర్మల, జిల్లా కోశాధికారి కె.రామలక్ష్మి మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్ సంస్థల ఊడిగం చేస్తోందని ఆరోపించారు. ధరలు విపరీతంగా పెరిగినా కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయకపోవడం దారుణమన్నారు. గిట్టుబాటు ధరలు లేక రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల ఆత్మహత్యలను నివారించాలని, ఉపాధి హామీ పథకాన్ని పటిష్టంగా అమలుచేయాలని, ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ ఆపాలని, స్కీమ్ వర్కర్స్ జీతాలు పెంచాలని డిమాండ్ చేశారు. అనంతరం ఐటీడీఏ పీవో, సబ్‌కలెక్టర్లకు వినతిపత్రాలు అందజేశారు. గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు సిరిమల్ రెడ్డి, సీఐటీయూ నాయకులు కొమరం చెల్లయమ్మ, కె.మంగాయమ్మ, కె.రమణమ్మ పాల్గొన్నారు.

రూ.630 కోట్లతో తాగునీటి పథకాలు

- రేషన్ బియ్యం అక్రమంగా తరలిస్తే క్రిమినల్ కేసులు
- జిల్లాలో 46 ధాన్యం కొనుగోలు కేంద్రాలు
- కలెక్టర్ దినేష్‌కుమార్


వీడియో సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్

సాక్షి,పాడేరు: జల్‌జీవన్ మిషన్ పథకంలో రూ.630కోట్లతో తాగునీటి పథకాలను నిర్మిస్తున్నట్టు కలెక్టర్ ఎ.ఎస్.దినేష్‌కుమార్ తెలిపారు. కలెక్టరేట్ నుంచి పలుశాఖల అధికారులతో మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాగునీటి పథకాలను అసంపూర్తిగా నిలిపివేస్తే సంబంధిత అధికారుల నుంచి నిధులను రికవరీ చేస్తామని హెచ్చరించారు. జిల్లాలో 46 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు. ఎ గ్రేడ్‌ను క్వింటా రూ.2,320,సాధారణ రకం రూ.2,300 ధరతో కొనుగోలు చేయనున్నట్టు తెలిపారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని రైసు మిల్లులకు తరలించాలని ఆదేశించారు. 20 రాగుల కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి, క్వింటా రూ.4,290 మద్దతు ధరతో కొనుగోలు చేయాలని ఆదేశించారు. లబ్ధిదారులకు అందిస్తున్న రేషన్ బియ్యం పక్కదారి పట్టకుండా రేషన్‌డిపోలను స్పెషల్ డ్రైవ్‌తో తనిఖీలు చేయాలన్నారు. అక్రమంగా రవాణా చేసే వారిపై 6ఎ, క్రిమినల్ కేసులు నమోదు చేయాలని అధికారులను ఆదేశించారు. స్వయం సహాయక సంఘాలకు రుణ పరిమితిని పెంచాలని,గతంలో ఇచ్చిన రుణాలను సకాలంలో రికవరీ చేయాలని సూచించారు. రంపచోడవరం,అడ్డతీగల,రాజవొమ్మంగి వెలుగు ఏపీఎంల పనితీరుపై ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. వారపుసంతల్లో నకిలీ వస్తువులు విక్రయించకుండా ఆహార భద్రత అధికారులు చర్యలు తీసుకోవాలని,వారపు సంతల్లో గిరిజనేతరులు ఎంతమంది, గిరిజనులు ఎంతమంది వ్యాపారాలు చేస్తున్నారో గుర్తించాలని తెలిపారు. స్వయం సహాయక సంఘాలతో సంతల్లో మార్టులు ఏర్పాటు చేసి నిత్యావసర వస్తువులు విక్రయించాలని సూచించారు. వారపుసంతల్లో ఆశీలు వసూళ్లపై దృష్టి పెట్టాలని,డిసెంబర్ 7న అన్ని విద్యాలయాల్లోను పేరెంట్‌చ,టీచర్ మీట్‌లను విజయవంతంగా నిర్వహించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో డీఆర్‌డీఏ పీడీ మురళీ, జిల్లా పౌరసరఫరాలశాఖాధికారి గణేష్‌కుమార్, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ జవహర్‌కుమార్,డీఈవో బ్రహ్మజీరావు,పలుశాఖల అధికారులు పాల్గొన్నారు.

సోషల్ మీడియా కార్యకర్తలపై దాడులు సహించం

అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం హెచ్చరిక


విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మత్స్యలింగం

అరకులోయ టౌన్: వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా ప్రతినిధులు, కార్యకర్తలపై దాడులు, అక్రమ కేసులు పెడితే సహించేది లేదని అరకులోయ ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం అన్నారు. 75వ రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా మంగళవారం అరకులోయ పట్టణంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి ఆయన పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఎమ్మెల్యే విలేకరులతో మాట్లాడుతూ ప్రపంచంలోనే భారత రాజ్యాంగం అతి పెద్దదన్నారు. రాజ్యాంగం వల్ల బడుగు, బలహీన, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాల ప్రజలు ఉన్నత స్థానాల్లో ఉన్నారన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, సోషల్ మీడియాపై దాడులు పెరిగాయని, అక్రమ కేసులు బనాయిస్తున్నారని ఆరోపించారు. అయినా భయపడే ప్రసక్తి లేదని, న్యాయ స్థానంలో పోరాటం చేస్తామన్నారు. కార్యకర్తలెవ్వరూ అధైర్య పడొద్దని, ఎల్లవేళలా అండగా ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ శెట్టి రోషిణి, ఎంపీపీ రంజపల్లి ఉషారాణి, వైస్ ఎంపీపీ కిల్లో రామన్న, ఎంపీటీసీ శెట్టి లలిత, ఆనంద్‌కుమార్, సర్పంచ్‌లు పెట్టెలి సుస్మిత, రాధిక, రమేష్, రాష్ట్ర ఎస్టీ సెల్ ప్రధాన కార్యదర్శి పాంగి చిన్నారావు, అరకు పార్లమెంట్ నాయకుడు కమిడి అశోక్, పార్టీ మండల అధ్యక్షుడు లొక్కోయి లక్ష్మణ కుమార్, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు నర్సింగరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు నరసింహమూర్తి, సుక్రయ్య, బాలరాజు, భూర్జ భాస్కర్‌రావు, సాంబయ్య, స్వాభి రాంచందూర్, తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ ఆశయాలు వైఎస్సార్‌సీపీతోనే సాధ్యం

- రాజ్యాంగ హక్కుల దుర్వినియోగంలో చంద్రబాబు దిట్ట
- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు


రంపచోడవరంలో రాజ్యాంగ ఆమోద దినోత్సవంలో మాజీ ఎమ్మెల్యే ధనలక్ష్మి


పాడేరులోని పాత బస్టాండ్‌లో అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు, మాజీ ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి, వైఎస్సార్‌సీపీ నేతలు

సాక్షి, పాడేరు: భారత రాజ్యాంగ సృష్టికర్త డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయాలు సాధన లక్ష్యంగా వైఎస్సార్‌సీపీ పని చేస్తుందని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు, పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు అన్నారు. భారత రాజ్యాంగ 75వ ఆమోద దినోత్సవాన్ని మంగళవారం పాడేరు పాత బస్టాండ్ ఆవరణలో ఘనంగా నిర్వహించారు. అంబేడ్కర్ విగ్రహానికి ఎమ్మెల్యేతో పాటు, ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి, పాడేరు వైస్ ఎంపీపీ కనకాలమ్మ, పార్టీ మండల అధ్యక్షుడు సీదరి రాంబాబు, తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు మాట్లాడుతూ భారత రాజ్యాంగంలో కల్పించిన హక్కులు, చట్టాల పరిరక్షణ గత ఐదేళ్ల వైఎస్సార్‌సీపీ పాలనలో సాధ్యమైందన్నారు. ఏపీలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత హక్కులు, చట్టాలకు భంగం కలిగించే విధంగా పాలన ఉందని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజ్యాంగం కల్పించిన హక్కులను దుర్వినియోగం చేయడంలో సీఎం చంద్రబాబు దిట్టన్నారు. రాజకీయ కక్షలతో సోషల్ మీడియా కార్యకర్తలను భయభ్రాంతులకు గురిచేస్తూ తప్పుడు కేసులతో జైళ్లకు పంపడం అన్యాయమన్నారు. రానున్న రోజుల్లో కూటమి ప్రభుత్వానికి ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని ఆయన హెచ్చరించారు. మాజీ ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి మాట్లాడుతూ రాజ్యాంగం కల్పించిన హక్కులు, చట్టాలను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలను విస్మరించిందని, వాటిని ప్రశ్నిస్తున్న సోషల్ మీడియా కార్యకర్తలు, ప్రతిపక్ష నాయకులపై తప్పుడు కేసులు పెడుతూ భావ స్వేచ్ఛను హరిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి సీదరి మంగ్లన్నదొర, పార్టీ జి.మాడుగుల మండల అధ్యక్షుడు నుర్మాని మత్స్యకొండంనాయుడు, ఎంపీటీసీలు గిడ్డి విజయలక్ష్మి, లకే రామకృష్ణపాత్రుడు, సన్యాసిరావు, సర్పంచ్‌లు నీలకంఠం, సోమెలి లక్ష్మణరావు, మాజీ సర్పంచ్‌లు నాగరాజు, కన్నాపాత్రుడు, బొంజుబాబు, పార్టీ సీనియర్ నాయకులు లకే రత్నాబాయ్, లకే రామసత్యవతి, ఊర్వశిరాణి, బూర మహేష్, చిట్టిబాబు, లక్ష్మణపడాల్, తదితరులు పాల్గొన్నారు.

అన్ని వ్యవస్థలను దెబ్బతీసేలా కూటమి పాలన

రంపచోడవరం: రాష్ట్రంలో టీడీపీ కూటమి పాలన అన్ని వ్యవస్థలను దెబ్బతీసేలా ఉందని రంపచోడవరం మాజీ ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి ఆరోపించారు. రంపచోడవరంలో జరిగిన రాజ్యాంగ ఆమోద దినోత్సవంలో భాగంగా అంబేడ్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ధనలక్ష్మి మాట్లాడుతూ అంబేడ్కర్ దేశానికి గొప్ప రాజ్యాంగాన్ని అందించారన్నారు. మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎస్టీ, ఎస్సీ, బీసీ, మైనార్టీలకు పెద్ద పీట వేశారని గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాలుగు నెలల్లోనే ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బందం శ్రీదేవి, జెడ్పీటీసీ పండా వెంకటలక్ష్మి, సర్పంచ్ మంగా బొజ్జయ్య, పార్టీ మండల కన్వీనర్ జల్లేపల్లి రామన్నదొర, ఎంపీటీసీలు ఉలవల లక్ష్మి, తుర్రం వెంకటేశ్వర్లుదొర, సర్పంచ్‌లు వడగల ప్రసాద్, కోసు రమేష్‌బాబుదొర, పార్టీ నాయకులు పండా రామకృష్ణదొర, దండంగి సింహాద్రి, బొబ్బా శేఖర్, కారుకోడి పూజ, కొండ్రాజు, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

విద్యా ప్రమాణాలు మెరుగుపడక పోతే చర్యలు

కలెక్టర్ దినేష్‌కుమార్ హెచ్చరిక


ఎంఈవోలు, ఏటీడబ్ల్యూవోలతో మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్

సాక్షి, పాడేరు: విద్యార్థుల విద్యా ప్రమాణాలు మెరుగుపడకపోతే ఉపాధ్యాయులపై చర్యలు తీసుకుంటామని కలెక్టర్ ఎ.ఎస్.దినేష్‌కుమార్ హెచ్చరించారు. స్థానిక తలారిసింగి ఆశ్రమ పాఠశాలలో ఎంఈవోలు, ఏటీడబ్ల్యూవోలకు బేస్‌లైన్ ఎగ్జామ్స్ దిశ కార్యక్రమం అమలుపై మంగళవారం శిక్షణ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన కలెక్టర్ మాట్లాడుతూ మండల విద్యాశాఖ అధికారులు పర్యవేక్షణ లోపం కారణంగానే విద్యార్థులు చదువులో వెనుకబడుతున్నారని చెప్పారు. ఎంఈవోలతో పాటు ఏటీడబ్ల్యూవోలు క్షేత్ర స్థాయిలో పర్యటించి, గిరిజన విద్యార్థులకు మెరుగైన విద్యను అందించేందుకు అంకిత భావంతో కృషి చేయాలన్నారు. విద్యార్థులకు బేస్ ఎగ్జామ్స్ పెట్టి సి,డి గ్రూప్‌లలో ఉన్న వారి విద్యాభివృద్ధిపై ప్రత్యేకంగా దృష్టిపెట్టాలని ఆదేశించారు. ప్రతి విద్యార్థికి చదవడం, రాయడం రావాలన్నారు. ఈనెల 29, 30 తేదీల్లో మార్గదర్శిని వర్కు షాపును నిర్వహిస్తామని చెప్పారు. డీఈవో పి.బ్రహ్మజీరావు, ఇన్‌చార్జి డీడీ రజనీ,నీతి ఆయోగ్ ప్రోగ్రాం అధికారి నారాయణరెడ్డి పాల్గొన్నారు.

చలిగాలులు ఉధృతం


పాడేరులో దట్టంగా కురుస్తున్న పొగమంచు

సాక్షి,పాడేరు/చింతపల్లి: జిల్లా వ్యాప్తంగా చలిగాలులు ఉధృతమయ్యాయి. మరో వైపు పొగమంచు దట్టంగా కురుస్తోంది. అరకులోయ కేంద్ర కాఫీబోర్డులో 11.6 డిగ్రీలు, హుకుంపేటలో 11.9, జి.మాడుగులలో 11.9, చింతపల్లిలో 13.2, అనంతగిరిలో 13.8, పాడేరు మండలం మినుములూరు కేంద్ర కాఫీబోర్డు,పెదబయలులో 14 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గత వారం రోజులుగా కనిష్ట ఉష్ణోగ్రతలు స్థిరంగా ఉన్నట్టు చింతపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం ఏడీఆర్, ఉష్ణోగ్రతలు విభాగం నోడల్ అధికారి డాక్టర్ ఆళ్ల అప్పలస్వామి తెలిపారు.

గిరిజనులకు మెరుగైన వైద్యం అందించాలి

అరకులోయటౌన్: అరకులోయ ఏరియా ఆస్పత్రిలో రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలని ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం వైద్యులకు సూచించారు. మంగళవారం అరకులో ఏరియా ఆస్పత్రిలో సూపరింటెండెంట్ రాము, వైద్య సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆస్పత్రిలో సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. నీటి సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు.

ఆశ్రమ పాఠశాల ఉపాధ్యాయుల పనితీరుపై నివేదిక


మాట్లాడుతున్న పీవో కట్టా సింహాచలం

రంపచోడవరం: ఏజెన్సీలోని ఆశ్రమ పాఠశాలల విద్యార్థులు చదువుపై దృష్టి పెట్టేలా చర్యలు తీసుకోవాలని రంపచోడవరం ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం అన్నారు. ఐటీడీఏ సమావేశపు హాలులో మంగళవారం డీడీ విజయశాంతితో కలిసి హెచ్‌ఎంలు, ఏటీడబ్ల్యూవోలతో సమీక్ష నిర్వహించారు. పీవో మాట్లాడుతూ ఆశ్రమ పాఠశాలల విద్యార్థులకు ప్రోగ్రాస్ కార్డులు జారీ చేస్తామన్నారు. త్వరలో విద్యార్థుల తల్లులకు ముగ్గుల పోటీలు, తండ్రులకు టగ్ ఆఫ్ వార్ పోటీలు నిర్వహిస్తామన్నారు. ఆశ్రమ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయుల పనితీరుపై కాంప్లెక్స్‌ల వారీగా నివేదికలు తయారు చేసి సమర్పించాలని హెచ్‌ఎంలను పీవో ఆదేశించారు. ఈ సమావేశంలో ఏటీడబ్ల్యూవోలు రామతులసి, కృష్ణ మోహన్, హెచ్‌ఎం బీఎస్ కుమార్ పాల్గొన్నారు.

నాగుపాము హల్‌చల్


అడవిలో వదిలి పెట్టిన నాగుపాము

సాక్షి, పాడేరు: పాడేరు పట్టణంలో చాకలి పేట వీధిలో ఓ నాగుపాము మంగళవారం హల్‌చల్ చేసింది. ఓ ఇంట్లో దూరి తిష్ట వేసిన పామును స్నేక్ క్యాచర్ బండారు ఉదయ్ భాస్కర్ చాకచక్యంగా పట్టుకుని, పాడేరు ఘాట్ రోడ్డులో వదిలి పెట్టడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

యువకుడిపై పోక్సో కేసు

చింతపల్లి: మండలంలో బాలికను గర్భవతిని చేసిన యువకుడిపై అన్నవరం పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. పోలీసులు అందించిన వివరాలు ప్రకారం 14 ఏళ్ల బాలిక, 19 సంవత్సరాల యువకుడు ప్రేమించుకున్నారు. వారిద్దరి మధ్య శారీరక సంబంధం ఏర్పడి బాలిక గర్భవతి అయింది. ఈ విషయం తెలుసుకొన్న బాలిక తండ్రి చేసిన ఫిర్యాదు మేరకు అన్నవరం పోలీసులు పోక్సో కేసు నమోదు చేసి, విచారణ జరుపుతున్నారు.

గంజాయి తోటలు ధ్వంసం

ముంచంగిపుట్టు: మండలంలోని మారుమూల వనుగుమ్మ పంచాయతీ దాబుగూడ,సంగడ గ్రామాల్లో నాలుగు ఎకరాల్లో గంజాయి పంటను పోలీసులు ధ్వంసం చేసి, దగ్ధం చేశారు. ఎస్పీ అమిత్ బర్దర్ ఆదేశాల మేరకు ఎస్ఐ రామకృష్ణ ఆధ్వర్యంలో పోలీసులు,రెవెన్యూ,ఫారెస్టు శాఖల అధికారులు మంగళవారం ఆంధ్ర ఒడిశా సరిహద్దులో డ్రోన్ కెమెరా సాయంతో గంజాయి సాగును గుర్తించారు. దాబుగూడ,సంగడ గ్రామాల్లో కొండ ప్రాంతాల్లో సాగు చేస్తున్న గంజాయి మొక్కలను పూర్తిగా నరికి వేశారు. నరికిన మొక్కలను ఎక్కడకక్కడ పోగులుగా వేసి దగ్ధం చేశారు. గంజాయి పంటను వేసిన రైతులను గుర్తించి,నిందితులపై చర్యలు తీసుకుంటామని ఎస్ఐ రామకృష్ణ చెప్పారు. గంజాయి సాగు చేసే వారంతా స్వచ్ఛందంగా పంటను నరికివేయాలని, లేకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ రుక్మిణి, వీఆర్వో రామచందర్, పోలీసులు పాల్గొన్నారు.

వైభవంగా శివపార్వతుల కల్యాణం


పొల్లూరు ఆలయంలో పూజ కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

మోతుగూడెం: పొల్లూరు శ్రీదుర్గా మల్లేశ్వరిస్వామి ఆలయంలో శివపార్వతుల కల్యాణం మంగళవారం వైభవంగా జరిగింది. ఉదయం నుంచి మహిళలు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం అర్చకుడు కుమారస్వామి శర్మ ఆధ్వర్యంలో శివ కల్యాణం జరిపారు.

సాయుధ దళాల పతాక దినోత్సవ స్టిక్కర్లు ఆవిష్కరణ


సాయుధ దళాల పతాక దినోత్సవ స్టిక్కర్లు, కారు ఫ్లాగ్స్‌ను ఆవిష్కరిస్తున్న దినేష్‌కుమార్, సత్యానందం

సాక్షి, పాడేరు: వచ్చే నెల 7వ తేదీన జరిగే సాయుధ దళాల పతాక దినోత్సవాన్ని పురస్కరించుకుని రూపొందించిన స్టిక్కర్లు, కారు ఫ్లాగ్స్‌ను కలెక్టర్ ఎ.ఎస్.దినేష్‌కుమార్ ఆవిష్కరించారు. జిల్లాలోని వివిధ కార్యాలయాలకు పంపి, వాటి అమ్మకాల ద్వారా వచ్చిన సొమ్మును యుద్ధంలో మరణించిన, గాయపడిన కుటుంబాల సంక్షేమానికి వినియోగిస్తారని కలెక్టర్ తెలిపారు. జిల్లా సైనిక సంక్షేమ అధికారి జి.సత్యానందం, సీనియర్ సహాయకుడు శ్రావణ్‌కుమార్ పాల్గొన్నారు.

మహిళలపై హింసకు వ్యతిరేకంగా ప్రచారం

జెండర్ ఆధారిత హింసకు వ్యతిరేకంగా ప్రచారం నిర్వహించి, ప్రజలను చైతన్యవంతం చేయాలని కలెక్టర్ ఎ.ఎస్.దినేష్‌కుమార్ ఆదేశించారు. మహిళలపై హింసకు వ్యతిరేకంగా 'కలిసికట్టుగా ఒకే స్వరం' అనే నినాదంతో గ్రామీణాభివృద్ధి శాఖ రూపొందించిన ప్రచార పోస్టర్లను కలెక్టర్ ఆవిష్కరించారు. అన్ని మండల కేంద్రాలు, గ్రామైక్య సంఘాలకు పంపించి జెండర్ ఆధారిత హింసపై విస్తృత ప్రచారం చేయాలని కలెక్టర్ సూచించారు. డీఆర్డీఏ పీడీ మురళి, జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి డాక్టర్ రోహిణి, జిల్లా వ్యవసాయాధికారి ఎస్‌బీఎస్ నందు, జిల్లా ఉద్యానవన అధికారి రమేష్‌కుమార్‌రావు, డ్వామా పీడీ విద్యాసాగర్ పాల్గొన్నారు.

జీవో 124ను అమలు చేయాలి

గ్రామ సచివాలయాల హెల్త్ సెక్రటరీల వినతి


డీఎంహెచ్‌వో డాక్టర్ జమాల్‌బాషాకు వినతిపత్రం అందజేస్తున్న గ్రామ సచివాలయాల హెల్త్ సెక్రటరీలు

పాడేరు : జిల్లాలోని గ్రామ సచివాలయాల్లో పనిచేస్తున్న హెల్త్ సెక్రటరీలు వైద్యారోగ్య శాఖలో పని చేసేలా ఉన్నతాధికారులు జారీ చేసిన జీవో నంబర్ 124 ను అమలు చేయాలని గ్రామ సచివాలయాల హెల్త్ సెక్రటరీల యూనియన్ జిల్లా అధ్యక్షురాలు ఎం.వి.వి.ఎస్. కుమారి, మండల అధ్యక్షురాలు కె.సుశీల కోరారు. ఈ మేరకు మంగళవారం ఐటీడీఏలో డీఎంహెచ్‌వో డాక్టర్ జమాల్‌బాషాకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైద్యారోగ్య శాఖ, పంచాయతీరాజ్ శాఖల మధ్య పనిచేస్తూ ఒత్తిడితో సమతమవుతున్నామన్నారు. వైద్యారోగ్య శాఖలోనే పనిచేయాలని వైద్యారోగ్య శాఖ ఉన్నతాధికాల ఆదేశాలను ఎంపీడీవోలు అమలు చేయడం లేదని చెప్పారు. వేతనాలు పంచాయతీరాజ్ శాఖ ద్వారా చెల్లిస్తున్నందున తాము అప్పగించిన పనులతో పాటు వైద్యారోగ్య శాఖ పనులు కూడా చేయాల్సిందేనని హుకుం జారీ చేస్తున్నారని తెలిపారు. ఒకే రోజు రెండు శాఖల కార్యక్రమాలు ఏ విధంగా చేస్తామని ప్రశ్నించారు. తాము ఏ శాఖ పరిధిలో పనిచేయాలో అధికారులే తేల్చి చెప్పాలని కోరారు. వైద్యారోగ్య శాఖ అప్పగించిన పనులు చేయకపోతే డ్యూటీ సర్టిఫికెట్లు జారీ చేయడం లేదన్నారు. ఎంపీడీవో చెప్పిన పనులు చేయకపోతే వేతనాలు చెల్లించబోమని బెదిరిస్తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. తామంతా తీవ్ర మానసిక క్షోభకు గురవుతున్నామని ఈ వ్యవహారంపై చర్చించి తమ సమస్యను పరిష్కారించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ సచివాలయాల హెల్త్ సెక్రటరీల యూనియన్ జిల్లా నాయకులు పుష్పవతి, రాజేశ్వరి, గౌరవ అధ్యక్షుడు శెట్టి నాగరాజు, కాంటాక్ట్ ఔట్‌సోర్సింగ్ యూనియన్ నాయకులు కె.లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

సేంద్రియ పంటలపై దృష్టి సారించాలి

చింతపల్లి: గిరిజన రైతులు సేంద్రియ పంటల సాగుపై దృష్టి సారించాలని డివిజనల్ ట్రైనింగ్ మాస్టర్ వెంకట్ సూచించారు. మంగళవారం మండలంలోని అంతర్ల రైతు సేవా కేంద్రంలో చింతపల్లి, జీకే వీధి, కొయ్యూరు మండలాలకు చెందిన వ్యవసాయ కార్యకర్తలతో జరిగిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ శిక్షణ తరగతులు 30వ తేదీ వరకు కొనసాగుతాయన్నారు. ఆరోగ్య జీవనం కోసం సేంద్రియ పద్ధతిలో సాగు చేపట్టడం చాలా అవసరమన్నారు.